సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం ၊ 10 ၊ అక్టోబర్ ၊ 2023



సరిహద్దులో తనిఖీలు

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸



వర్గీకరణతోనే వెలుగులు

వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు నిండుతాయని మందకృష్ణ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.7 /19.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

12న వేలం పాట

పాలమూరు: జిల్లాలో వివిధ కేసుల్లో రవాణా శాఖ సీజ్ చేసిన, పోలీస్‌స్టేషన్‌లలో ఉండి వాహన యాజమానులు, ఫైనాన్స్ నిర్వాహకులు తీసుకోకుండా దీర్ఘకాలికంగా ఉన్న వాహనాలకు ఈనెల 12న జిల్లా డీటీసీ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు డీటీసీ దుర్గాప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే వేలం పాటలో ఆసక్తి కలిగిన వారు హాజరుకావాలని సూచించారు.

11న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఉమ్మడి జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఈనెల 11న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు ఇంటర్‌మీడియట్ బోనఫైడ్, ఎస్ఎస్‌సీ జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీఈటీ రాజవర్ధన్‌రెడ్డి(9866811816) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మిషన్ ఇంద్రధనుష్‌పై డబ్ల్యూహెచ్‌ఓ ఆరా



గండేడ్: మిషన్ ఇంద్ర ధనుష్ పథకం అమలు పరిశీలించేందుకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సభ్యులు శ్రేయ, గాయత్రి సోమవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి, చెన్నాయిపల్లి తండాలను సందర్శించారు. ఈ పథకం ఏవిధంగా అమలు అవుతుంది? టీకాలు ఇస్తున్నారా లేదా అందరిని చైతన్యం చేస్తున్నారా? అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మిషన్ ఇంద్రధనుష్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట సీహెచ్‌ఓ రాములు, సూపర్‌వైజర్ శాంతమ్మ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన సందర్భంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు కోరారు. జిల్లా కేంద్రం పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పుడు విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ పరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 2022 ఫిబ్రవరి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన చివరి నెల జీతం, 2013 పీఆర్‌సీ బకాయిల బాండ్ల డబ్బులను, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాజ్యువిటీ తదితర బకాయిలు ఇంతవరకు చెల్లించకపోవడంతో వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జీబీపాల్, నారాయణ, భగవంతు, బీహెచ్.కుమార్, యాదయ్య, మోహన్‌రెడ్డి, బుచ్చన్న, నాగాంజనేయులు పాల్గొన్నారు.

పీయూలో ‘మీట్ ది సైంటిస్ట్’



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ గిరిజ హాజరై మాట్లాడారు. సమాజంలో అసమానతలను తగ్గించేందుకు ప్రయోగాలు చోదక శక్తిగా పనిచేస్తాయని తెలిపారు. ప్రతి సైన్స్ విద్యార్థి పరిశోధనలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పంట దిగుబడి కోసం విపరీతమైన రసాయనాలు వినియోగించడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. 42 రోజుల రోజుల తర్వాత నిల్వ చేసిన రక్తంలో వ్యర్థ పదార్థాలు ఏర్పడతాయని, నానోపార్టికల్స్‌ను ఉపయోగించి వ్యర్థాలను తొలగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, పవన్‌కుమార్, నూర్జహాన్, శ్రీధర్‌రెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హంస ధర రూ.2,029

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన ఈనామ్ టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,029, కనిష్ఠంగా రూ.1,960గా ధరలు నమోదయ్యాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,429, కనిష్ఠంగా రూ.5,409గా ధరలు లభించాయి.

● మోగిన నగారా

పోరు.. ఇక జోరు

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో వేడెక్కిన పాలమూరు
- నవంబర్ 30న పోలింగ్.. డిసెంబర్ 3న కౌంటింగ్
- గెలుపే లక్ష్యంగా వ్యూహాల అమలుకు పార్టీల సన్నద్ధం
- అభ్యర్థుల ఖరారుతో ప్రచారంలో దూసుకెళ్తున్న ‘కారు’
- కాంగ్రెస్, బీజేపీలో ఇంకా తేలని అభ్యర్థిత్వాలు
- అయినా ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి..



నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు..

నియోజకవర్గం	పీఎస్‌లు
మహబూబ్‌నగర్	272
జడ్చర్ల	274
దేవరకద్ర	289
వనపర్తి	296
నాగర్‌కర్నూల్	259
అచ్చంపేట	265
కొల్లాపూర్	269
గద్వాల	303
అలంపూర్	290
నారాయణపేట	270
మక్తల్	284
కొడంగల్	279
కల్వకుర్తి	262

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పాలమూరులో రాజకీయం వేడెక్కింది. గెలుపు వ్యూహాలతో రాజకీయ పక్షాలు సమరానికి సిద్ధమవుతున్నాయి. నవంబర్ మూడో తేదీన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అధికారికంగా ఎన్నికల గెజిట్ విడుదల చేయనుండగా.. అదే నెల 30వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సోమవారం నుంచి పోలింగ్ నాటికి 51 రోజుల వ్యవధి రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు కీలకంగా మారనుంది. మరోవైపు ఇప్పటికే తుది ఓటర్ల జాబితా విడుదల కాగా.. పోలింగ్‌స్టేషన్లు, సౌకర్యాల కల్పన తదితర ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రాగా.. ఇందుకనుగుణంగా చర్యలు చేపట్టింది. ఓటు హక్కు వినియోగంపై అవగాహనతో పాటు ఎన్నికల నిర్వహణకు సిబ్బంది, బందోబస్తు తదితర ఏర్పాట్లపై నిమగ్నమైంది.

ఓట్ల వేటలో నాయకులు..

ఉమ్మడి పాలమూరులో 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, వనపర్తి, నారాయణపేట, మక్తల్, కొడంగల్, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, గద్వాల, అలంపూర్) ఉన్నాయి. ఇందులో షాద్‌నగర్ సెగ్మెంట్ పూర్తిగా, కల్వకుర్తి, కొడంగల్ నియోజకవర్గాల్లోని పలు మండలాలు జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డిలోకి వెళ్లాయి. షాద్‌నగర్ మినహా 13 నియోజకవర్గాల వ్యాప్తంగా మొత్తం 30,53,862 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఇందులో పురుషులు 15,25,132 కాగా.. మహిళా ఓటర్లు 15,28,661, ఇతరులు 69 మంది ఉన్నారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, గద్వాల, అలంపూర్, నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అంతేకాక.. ఉమ్మడి పాలమూరులో యువ ఓటర్లు 54.07 శాతం ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. అదేవిధంగా 80 ఏళ్లు దాటిన వృద్ధులు 31,255 మంది, దివ్యాంగ ఓటర్లు 52 వేల మంది ఉండగా.. వీరికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పక్షాలు ఓట్ల వేటకు సమాయత్తమవుతున్నాయి. నియోజకవర్గాల వారీగా ఆయా ఎమ్మెల్యే అభ్యర్థులు, ఆశావహులు.. మహిళలు, పురుషులు, యువతతో పాటు సామాజికవర్గాల వారీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.



‘పాలమూరు’పైనే ఫోకస్..

రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే పాలమూరు కేంద్ర స్థానంగా నిలుస్తోంది. రాష్ట్రంలో రాజకీయ సమీకరణలకు కేరాఫ్‌గా నిలిచే ఈ ప్రాంతంపై అన్ని రాజకీయ పక్షాలు ప్రత్యేక నజర్ వేశాయి. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో 13 మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలిచి, ఆ తర్వాత పరిణామాల క్రమంలో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసారి సైతం ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలు గెలుపొంది క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ వ్యూహాలు అమలు చేస్తోంది. అభ్యర్థుల ఖరారు తర్వాత సీఎం కేసీఆర్ కొల్లాపూర్‌లోని నార్లాపూర్ వద్ద పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో మొదటి మోటార్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత బహిరంగసభలో మాట్లాడారు. అదేవిధంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. జిల్లాకు చెందిన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి వారివారి నియోజకవర్గాలతో పాటు ఇతర సెగ్మెంట్లలో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.



ఎన్నికల కోడ్ రావడంతో నాగర్‌కర్నూల్‌లో ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కాంగ్రెస్, బీజేపీ సైతం..

కాంగ్రెస్ ముఖ్య నేతలు సైతం పాలమూరుపై దృష్టి సారించారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జోడో యాత్ర పాలమూరు మీదుగా కొనసాగగా.. ఆ తర్వాత భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఈ ప్రాంతం గుండానే సాగింది. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సొంత ఇలాఖా పాలమూరే కాగా.. పలు పర్యాయాలు ఆయన వివిధ నియోజకవర్గాల్లో పర్యటించారు. బీజేపీ సైతం పాలమూరు కేంద్రంగా ఎన్నికల శంఖారావం పూరించింది. అధికారిక కార్యక్రమాలతో పాటు బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ అధికార బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్‌పై కురిపించిన విమర్శల జల్లుతో ఆ పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొంది. అలాగే జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు బీఆర్‌ఎస్‌పై విమర్శల హోరు పెంచారు. ఈ క్రమంలో దాదాపు నెలరోజులుగా రాజకీయ వాతావరణం హీటెక్కింది. తాజాగా ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో మరింత వేడి రాజుకోనున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

బీఆర్‌ఎస్ జోరు..

ఉమ్మడి పాలమూరులో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోరు హోరాహోరీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎవరికి వారు వ్యూహాలు రచిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ బరిలో నిలిచే అవకాశం ఇస్తూ ఆగస్టు 21న ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ జాబితాను ప్రకటించారు. అప్పటి నుంచి అందరు అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేస్తూ.. వారిని ప్రసన్నం చేసుకునేలా ముందుకుసాగారు. అదేవిధంగా అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో దాదాపుగా అన్ని మండలాలు, పలు ఊర్లను చుట్టేయగా.. ఆ పార్టీలో జోష్ నెలకొంది. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలో ఇప్పటివరకు అభ్యర్థులు ఖరారు కాకున్నప్పటికీ.. పలు కార్యక్రమాలతో ప్రజలను ఆకర్షించే ప్రణాళికను నేతలు అమలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఇటీవల ముఖ్య నేతలు చేరగా.. పార్టీ కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. వారం, పది రోజుల్లో హస్తం, కమలం పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల నియమావళి పాటించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రవినాయక్

● కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల నియమావళిని అధికారులు తప్పకుండా పాటించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్ సూచించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో వీసీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న రెండు నెలల కాలం అత్యంత ముఖ్యమైందన్నారు. ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించే మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకటించిన 24 గంటల్లోగా (మంగళవారం 12గంటల వరకు) అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, 48 గంటల్లోగా అన్ని పబ్లిక్ స్థలాల్లో, 74 గంటల్లో ప్రైవేట్ స్థలాల్లో ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు అన్ని తీసివేయాలన్నారు. మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని, అనంతరం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా నియమించిన కమిటీలన్నీ వెంటనే తమ కార్యకలాపాలను ప్రారంభించాలన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. పోలీసులతో పాటు అధికారులు బృందంగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఎస్పీ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేశామని, ఇది వరకే సీజర్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, అడిషనల్ ఎస్పీ రాములు, ఈఆర్‌ఓ జెడ్పీ సీఈఓ జ్యోతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి ఖాయమని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కొత్తగంజ్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రోజురోజుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా తెలంగాణలో అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. కర్ణాటక, హిమాచల్ రాష్ట్రాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. తెలంగాణలో అరాచక పాలన కొనసాగిందని, ఈ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, నాయకులు సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.



గ్యారంటీ పథకాల ప్రచారంలో పాల్గొన్న యెన్నం

18న సీఎం కేసీఆర్ రాక

● జడ్చర్లలో బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 18న మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్నారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 15న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత జిల్లాల వారీగా ఆయన నియోజకవర్గాల పర్యటనకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్లలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొననున్నారు.

వైభవంగా శివాజీ మహారాజ్ రథయాత్ర



జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీతో స్వాగతం పలుకుతున్న యువకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: శివాజీ స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి ఛత్రపతి శివాజీ మహారాజ్ రథయాత్ర వైభవంగా సాగింది. పాలమూరు యూనివర్సిటీ ఎదుట నుంచి బండమీదిపల్లి, వన్‌టౌన్ చౌరస్తా, క్లాక్‌టవర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణం మండపం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ హిందూసామ్రాజ్యాన్ని స్థాపించి 350 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అలంపూర్ నుంచి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివాజీ స్థాపించిన హిందూ సామ్రాజ్యం ఆఫ్ఘనిస్తాన్ నుంచి కటక్ వరకు విస్తరించిందన్నారు. యాత్రలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, పాండురంగారెడ్డి, గగనగిరి మహారాజ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శాంతిభద్రతలలో తెలంగాణ భేష్

- ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ తీసుకొచ్చాం
- రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో శాంతిభద్రతలు చాలా బాగున్నాయని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పాత పోలీస్ కార్యాలయం స్థానంలో రూ.39కోట్లతో నూతనంగా నిర్మించనున్న నూతన పోలీస్ కార్యాలయ భవనానికి సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి హోంమంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హోంమంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ శాంతిభద్రలతోపాటు రెవెన్యూకు అధిక ప్రాధాన్యత ఇస్తారని, ఇందులో భాగంగా పోలీస్ బడ్జెట్‌ను రెట్టింపు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను తీసుకువచ్చామని, అవసరమైన సమయాల్లో పోలీసులు కఠినంగా వ్యవహరించే విధంగా పూర్తి అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసి పోలీస్ శాఖ ద్వారా పూర్తి న్యాయం చేకూర్చినట్లు వివరించారు. మహిళల సంక్షేమంలో భాగంగా షీటీంలు, భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. మహబూబ్‌నగర్ నూతన పోలీస్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రస్తుతం రూ.39 కోట్లు మంజూరు చేసినప్పటికీ భవిష్యత్‌లో రూ.100 కోట్లతో కార్యాలయంతో పాటు సిబ్బంది క్వార్టర్స్ అన్నిరకాల సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నూతన పోలీస్ కార్యాలయం పట్టణ నడిబొడ్డున అందరికీ ఉపయోగకరంగా అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఐజీ కార్యాలయం కూడా ఇక్కడే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ కె.నరసింహ, ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు మహేష్, రమణారెడ్డి, శ్రీనివాస్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నూతన పోలీస్ కార్యాలయానికి భూమిపూజ చేస్తున్న మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ముఖచిత్రం పుస్తకావిష్కరణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): హైదరాబాద్‌ను తలదన్నేలా మహబూబ్‌నగర్ మహానగరంగా రూపుదిద్దుకున్నదని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మారుతున్న మహబూబ్‌నగర్ ముఖచిత్రం పేరిట పదేళ్ల ప్రగతిపై తయారు చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9 ఏళ్లలో జిల్లాలో చేసిన అభివృద్ధిని కళ్లకు కట్టేవిధంగా పుస్తక రూపంలో తయారు చేసి ఆవిష్కరించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఏ పథకం వచ్చినా మహబూబ్‌నగర్ ఉదాహరణగా చెబుతారని, గతంలో ప్రజలు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవించేవారని, అలాంటి ఇప్పుడు తిరిగి వస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసిన ఘనత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు దక్కుతుందన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్లలో జిల్లాను సమస్యల నుంచి బయటకు తీసుకొచ్చి ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు రూపురేఖలు మారిపోయాయన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎలా ఉందో ఇప్పుడు ఎలా ఉందో పుస్తక రూపంలో చూపించామన్నారు. కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నర్సింహ, ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పిల్లిగుండ్ల కాలనీకి చెందిన కృష్ణకు రెండేళ్ల కిందట వివాహమైంది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు తోడు భార్యాభర్తల నడుమ మనస్పర్థలు చోటుచేసుకోవడంతో మనస్తాపానికి గురైన అతడు పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించేందుకు 108కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది సీటుపై దుప్పటి వేస్తేనే యువకుడిని ఆస్పత్రికి తరలిస్తామని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సిబ్బంది తీరుపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆపదలో ఉన్న క్షతగాత్రులను క్షణాల్లో ఆస్పత్రికి తరలించకుండా జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

బాలిక మృతి

కేటీదొడ్డి: వైద్యం వికటించి బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని ఈర్లబండలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఈర్లబండకు చెందిన 13 ఏళ్ల బాలిక రక్త కణాలు పడిపోవడంతో తండ్రి ఆర్ఎంపీని సంప్రదించాడు. దీంతో ఆర్ఎంపీ బాలికకు సెలైన్ బాటిల్ పెట్టడంతో బాలికకు మూర్ఛ వచ్చి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఊర్కొండ: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఊరుకొండపేట శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ ఇస్మాయిల్ వివరాల మేరకు.. కల్వకుర్తి మండలం తోటపల్లికి చెందిన డేరంగుల మల్లయ్య (42) ఊరుకొండపేట శివారులోని గుట్టల్లో పనులు చేస్తూ జీవనోపాధి పొందేవాడు. ఆదివారం రోజు వారీగా పనులు చేసేందుకు వచ్చిన అతడు.. ఒంట్లో ఇబ్బందిగా ఉందని తోటి వారికి చెప్పి గుట్ట కిందకు వచ్చి నిద్రించాడు. నిద్రలోనే అతడు మృతి చెందగా, గుట్టపై పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

5 బూడిద లారీల పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా కర్ణాటక నుంచి తెలంగాణలోకి ఓవర్‌లోడ్‌తో బూడిదను తరలిస్తున్న ఐదు లారీలను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఓవర్ లోడ్, అనుమతి లేని లారీలను వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అప్పగించినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు. అనుమతి పత్రాలు ఉంటే లారీలను విడుదల చేస్తామని అన్నారు.

జాతీయ అంధుల క్రికెట్‌లో జిల్లా క్రీడాకారిణులు



మహబూబ్‌నగర్ క్రీడలు: కాన్పూర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి అంధుల లెవల్ బ్లెండ్ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఎం.సంగీత (కొండాపూర్), ఎస్.మహేశ్వరి (ఎదిర), ఎం.ప్రీతి (మహబూబ్‌నగర్), అంకిత (మహ్మదాబాద్) తెలంగాణ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారు.

సరిహద్దులో అక్రమ రవాణాకు కట్టడి

- అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి
- పుల్లూరు శివారులో పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు
- తొలి రోజు పట్టుబడిన మద్యం



అలంపూర్‌చౌరస్తా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీ చేపడుతున్న పోలీసులు

అలంపూర్: కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం విడదల చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల నియమావళిని అమలు చేస్తున్నారు. రాష్ట్రానికి సరిహద్దుగా ఉ న్న ఉండవెల్లి మండలం పుల్లూరు శివారులోని 44వ జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ పోలీసులు నిఘాపెట్టారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రా ష్ట్రాల నుంచి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలపై పోలీసులు తనిఖీ చేసి ప్రవేశానికి అనుమతిస్తున్నా రు. రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం, డబ్బు, మారణాయుధాలు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతోపాటు తనిఖీ చేపడుతున్నారు. సరిహద్దు చెక్ పోస్టు వద్ద తొలిరోజు తనిఖీల్లో దాదాపు 1.40 లక్షల విలువ చేసే మద్యం పట్టుబడింది. ప్రస్తుతానికి సరిహద్దు చెక్‌పోస్టులో నలుగురు పోలీస్ సిబ్బంది విధు లు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని పెంచుతామని ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు తెలిపారు.

నగదు పట్టివేత

కల్వకుర్తి టౌన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సోమవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది తని ఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళితే అందుకు సంబంధించిన ఆధారాలు చూయించాలని పోలీసులు చెబుతున్నారు. మండలంలోని మార్చాలకు చెందిన వెంకటేష్, నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన వెంకటయ్య రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా నగదును తీసుకెళ్తున్నామని తెలిపారు.

734 మద్యం బాటిళ్ల సీజ్

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులో మద్యం పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు తెలిపారు. సోమవారం హెడ్‌కానిస్టేబుల్ వీరన్న, హోంగార్డు రమేష్ వాహన తనిఖీ చేస్తుండగా మధ్యాహ్నం అనుమానం వచ్చిన వారు ఆటోను పరిశీలించగా బీర్లు, క్వాటర్ సీసాలను గుర్తించినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం మొత్తం 734 బాటిల్స్ ఉండగా అందులో 297 లీటర్ల లిక్కర్ ఉండొచ్చని అంచనాగా తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.1,39,098 ఉంటుందని తెలిపారు. ఆటో విలువ సైతం రూ.లక్షగా వివరించారు. పుల్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ బోయ సీతరాముడు మద్యం కొనుగోలు చేసి గ్రామంలో అవసరం ఉన్నవారికి అధిక ధరలకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మద్యం, ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం అక్రమంగా తరలిస్తున్న సీతరాముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



సరిహద్దులో పట్టుబడిన మద్యం, నిందితుడితో ఎస్ఐ బాలరాజు, సిబ్బంది

రూ.5.27లక్షల నగదు సీజ్

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల నగార మోగిన తొలిరోజునే జిల్లాలో రూ.5.27 లక్షల నగదును సీజ్ చేసినట్లు డీఎస్పీ ఆనంద్‌రెడ్డి వెల్లడించారు. ఎస్పీ సూచన మేరకు సోమవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించిన నాగాబందీలో నగదు లభించినట్లు వెల్లడించారు. వనపర్తి పీఎస్ పరిధిలోని వాహన తనిఖీల్లో రూ. 1.13 లక్షలు, కొత్తకోట పీఎస్ పరిధిలో రూ.2.35లక్షలు, ఆత్మకూరు పీఎస్ పరిధిలో రూ.లక్ష, పాన్‌గల్ పీఎస్ పరిధిలో రూ.79వేలు తీసుకువెళ్తున్న వారిని వాహన తనిఖీల్లో గుర్తించి నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్నట్లు భావించి సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సీజ్ చేసిన మొత్తం నగదును ఆదాయపన్నుశాఖ అధికారులకు అప్పగించారు.



కొత్తకోటలో నగదును పరిశీలిస్తున్న పోలీసులు

వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



తక్కశీలలో పాదయాత్ర చేస్తున్న మందకృష్ణ మాదిగ తదితరులు

మానవపాడు/ ఉండవెల్లి: ఎస్సీ వర్గీకరణ మాదిగల బతుకుల్లో వెలుగురేఖ వంటిదని, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆయన చేపట్టిన మహా పాదయాత్ర సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చండూరు, పల్లెపాడుతో పాటు ఉండవెల్లి మండలంలోనితక్కశీల, ప్రాగటూరు, మారమునగాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్ల జనాభా దమాషా ప్రకారం అన్ని కులాలకు అందడం లేదని, ఫలితంగా ఎస్సీలకు ఉన్న కులాల మధ్య తీవ్రమైన అసమానతలు పెరిగాయన్నారు. బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి తక్షణమే చట్టం చేసి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం వచ్చే నెల 7న హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నామని, పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. తక్కశీలలో ఎంపీపీ బీసమ్మ, సర్పంచ్ మద్దమ్మ ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్, మస్తాన్, సర్పంచ్ నర్సింహులు, నాయకులు నరేష్, నరేంద్ర, కర్ణాటక ఇన్‌చార్జ్ కార్తిక్, శివ, భీమన్న, జంగయ్య, ఎలీషా, జయరాజ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- ఒకే రోజు తండ్రి, కొడుకు మృతి
- కొల్లాపూర్ అంబేడ్కర్ కాలనీలో విషాదం



కుర్మయ్య (ఫైల్)



శివయ్య (ఫైల్)

కొల్లాపూర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రికి కడ వరకు సపర్యాలు చేశాడా కుమారుడు.. ఆరోగ్య పరిస్థితి విషమించి తండ్రి చనిపోగా.. ఆ బాధను తట్టుకోలేని కుమారుడికి ఫిట్స్ రావడంతో నీటికుంటలో పడి మృతి చెందాడు. ఒకే రోజు తండ్రి, కొడుకు మరణించడం అందరినీ కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. కొల్లాపూర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కర్నె కుర్మయ్య (55)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల కుర్మయ్య అనారోగ్యం బారిన పడటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తండ్రికి సపర్యాలు చేసేందుకుగాను పెద్ద కుమారుడు శివయ్య (30) కూడా ఆస్పత్రికి వెళ్లాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి కుర్మయ్య సోమవారం తెల్లవారుజామున మరణించాడు. తండ్రి మృతిని తట్టుకోలేని కుమారుడు శివయ్య ఆస్పత్రి బయటికి వచ్చాడు. ఈ క్రమంలోనే అతడికి ఫిట్స్ రావడంతో నీటిగుంతలో పడి మృతి చెందాడు. కుర్మయ్య మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నమే కొల్లాపూర్‌కు తీసుకురాగా, శివయ్య మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత తీసుకొచ్చారు. ఇరువురి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నారు. తండ్రి, కొడుకు మృతితో అంబేడ్కర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు.

మార్కెట్‌లోకి పల్సర్ ఎన్-150



నూతన బైక్‌ను మార్కెట్‌లోకి ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలమూరు: బజాజ్ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి నూతనంగా వచ్చిన పల్సర్ ఎన్-150ని సోమవారం జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ దగ్గర బజాజ్ షోరూంలో ఎంవీఐ నరేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ ఆవిష్కరించారు. అనంతరం షోరూం ఎండీ మహ్మద్ ఇసాక్ మాట్లాడుతూ పల్సర్ 150సీసీలో నూతన మోడల్ పల్సర్ ఎన్-150పేరుతో మార్కెట్‌లోకి వచ్చిందని, ఈబైక్ మూడు రంగులలో లభిస్తుందని, దీని షోరం ధర రూ.1,18,000 లభిస్తుందన్నారు. న్యూ రిఫైయిడ్ ఇంజన్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, మోనో షాక్ సస్పెన్షన్స్ ప్రత్యేకతలు ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో ఏరియా మేనేజర్ సూర్యకుమార్, షోరూం మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కొత్తకోట: ఎన్నికల కమిషన్ అనుమతితో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఎమ్మెల్సీ ఎ.వెంకట్‌నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల హెల్త్‌స్కీం, కేర్ ట్రస్ట్ విధివిధానాలను వెల్లడించిన తర్వాతే ఉద్యోగ, ఉపాధ్యాయ కాంట్రిబ్యూషన్ నిర్ణయించాలని కోరారు. టెట్ నిబంధన లేకుండా ఉపాధ్యాయ పదోన్నతులు చేపట్టారు. ఇందుకోసం కోర్టు కేసును త్వరితగతిన పరిష్కరించాలని, ఎన్నికల కమిషన్ అనుమతితో పదోన్నతులు, బదిలీలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐఆర్‌ను 20శాతానికి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. సమావేశంలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు, వేముల అమరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, వరప్రసాద్‌గౌడ్, దేవన్న, శివనారాయణ, లక్ష్మయ్య, రాములు, బాలకొండయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తిరుపతినాయక్, జలేందర్‌రెడ్డి, శశివర్ధన్, మురళి, పుల్లయ్య, రాంసుబ్బారెడ్డి, రాజేష్, రవికుమార్ ఉన్నారు.

దొంగచాటున నకిలీ ఇళ్లపట్టాలు పంపిణీ సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

ఎమ్మెల్యేపై ధ్వజమెత్తిన బీజేపీ నేత డీకే అరుణ

గద్వాల: రైతుల నుంచి భూములు సేకరించకుండా.. ఎలాంటి అభివృద్ధి పనులు లేకుండా.. కాగితాలపైనే నంబర్లు వేసి నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సిగ్గుచేటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధ్వజమెత్తారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు లేకుండా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంగచాటున ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని ఆరోపించారు. ప్రజలకు నకిలీ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణ జరిపి, వాటిని రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అయిదేళ్లలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేని బీఆర్ఎస్ నాయకులు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత గుర్తొచ్చిందా అని నిలదీశారు. పదేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసగించిన బీఆర్ఎస్ నాయకులు మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో రెవెన్యూ ఉన్నతాధికారుల సమక్షంలో తాను పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను గుంజుకున్న ఎమ్మెల్యేకు ఓట్లు అడిగే నైతికత లేదని విమర్శించారు. ఎలాంటి ఉత్తర్వులు, నిధులు లేని మెడికల్ కళాశాలకు ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌కు ఓటమి ఖరారు..

రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటమి ఖరారైందని, అది ముందే భావించి నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ, ప్రారంభోత్సవాలు చేపట్టారని ఆరోపించారు. ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన గట్టు లిఫ్టును పదేళ్లయినా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఈ ప్రాంతానికి చేసిందేమి లేదని విమర్శించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కేటీదొడ్డి మండలం కొండాపురంకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మహిళలు బీజేపీలో చేరారు. సమావేశంలో బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం సోమవారం రాత్రి 7 గంటల వరకు 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 120, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.480 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,021 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,085, సమాంత కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

నిలకడగా కోయిల్‌సాగర్ నీటి మట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు ఉండగా సోమవారం సాయంత్రం వరకు 31.10 అడుగుల మేర నీటి మట్టం ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 853.4 అడుగులు.

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 853.4 అడుగుల వద్ద 87.8 టీఎంసీల నీటినిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,250, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,505, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 7.734 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 15,446 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 163 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

హలీంకు ఫోర్ వీలర్స్ డ్రైవర్ల నివాళి

బిల్లులు ఇవ్వలేదని మనోవేదనతో మృతిచెందాడని ఆవేదన



హలీంకు నివాళి అర్పిస్తున్న యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ తహసీల్దార్‌కు హైర్ వెహికిల్ నడుపుతున్న హలీంకు 8 నెలల బిల్లులు రాకపోవడంతో మనోవేదనతో మృతి చెందినట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఆరోపించారు. తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, ఆయుర్వేదిక అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో హలీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారులతో నడుస్తున్న అద్దె వాహనాలకు చెందిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిల్లులు రాకపోవడంతో కుంటుబాలను పోషించుకోలేక అప్పుల పాలవుతున్నామన్నారు. 8 నెలలుగా అద్దె వాహనాలకు చెందిన బిల్లులు రాకపోవడంతో మనోవేదనతో ఆస్పత్రి పాలై చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఆరోపించారు. బిల్లుల కోసం ఎన్నిమార్లు అధికారులను కలిసినా.. ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. హలీం మృతి తమను తీవ్రంగా కలిసి వేసిందని ఇప్పటికైనా.. ప్రభుత్వ అధికారులు స్పందించి బిల్లులు వచ్చే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖాజాపాషా, నిరంజన్, నరసింహ, కేశవులు, సుధాకర్‌రెడ్డి, రాథీనాయక్, పఠాన్ పాల్గొన్నారు.

బడి బస్సు భద్రమేనా?

- ఫిట్‌నెస్ పరీక్షలకు రాకపోయినా తిప్పుతున్న వైనం
- 20 బస్సులకు ఫిట్‌నెస్ పత్రాలు నిల్
- మండలాల్లో పని చేస్తున్న స్కూల్ బస్సులపై నిర్లక్ష్యం

మహబూబ్‌నగర్ క్రైం: పిల్లలు బడికి వెళ్లడం ఎంత ముఖ్యమో, తిరిగి ఇంటికి రావడం అంతే ముఖ్యం. ఇందుకు పాఠశాల యాజమాన్యాలు చిన్నారులకు భద్రతపరమైనా భరోసా ఇవ్వాలి. మయూరీ పార్కు సమీపంలో సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సుకు జరిగిన రోడ్డు ప్రమాదంతో ఒక్కసారిగా తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు తప్ప ఇతర సందర్భాల్లో అధికార యంత్రాంగం మేల్కోవడం లేదు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు బాధ్యతగా ఉండాల్సింది పోయి బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలం చెల్లినవి, సామర్థ్యం లేని వాహనాల్లో పిల్లలను పాఠశాలలకు చేరవేస్తున్నాయి. దీంతో వారి ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. పాఠశాల బస్సులు తరుచూ ప్రమాదాలకు గురవ్వడంతో ఇటీవల ప్రభుత్వం నిబంధనలు మరింత కట్టుదిట్టం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించింది. కానీ కొన్ని పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా నిబంధనలు అతిక్రమించి ఫిట్‌నెస్ చేయించని బస్సులను ఉపయోగిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నా ఎలాంటి మార్పు ఉండటం లేదు.

జిల్లాలో 394 బస్సులు

జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తరలించేందుకు 394 బస్సులు ఉన్నాయి. వీటిలో 330 పాఠశాల బస్సులు ఉండగా 20 కళాశాలవి. దీంట్లో 274 బస్సులకు ఫిట్‌నెస్ చేసుకోగా మరో 20బస్సులకు ఫిట్‌నెస్ చేసుకోకుండా నడుపుతున్నారు. వీటన్నింటి ద్వారా నిత్యం 50వేల మంది వరకు వివిధ తరగతుల విద్యార్థులను విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్సులన్నింటికీ విద్యాసంస్థల యాజమాన్యాలు ఏటా డీటీఓ వద్ద ఫిట్‌నెస్ పరీక్షలు చేసి అనుమతి పత్రాలు పొందాల్సి ఉంటుంది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అర్హత పత్రాలు తీసుకోవాల్సిన కొందరు మరమ్మతులు ఇతర కారణాల వల్ల పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడం లేదు. విద్యాసంస్థల బస్సులకు ప్రత్యేకంగా పసుపు రంగుగుర్తు కేటాయించడంతో పాటు రక్షణ, సౌకర్యం కోసం పలు నిబంధనలు రూపొందించింది. విద్యాసంస్థల బస్సులన్నీ నిబంధనల మేరకు వసతులు కల్పించి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఫిట్‌నెస్ పరీక్షలుపూర్తి చేసుకోవాలి. బస్సుల నిర్వహణకు సంబంధించి విద్యార్థుల పూర్తి సంరక్షణ బాధ్యత తమదేనంటూ పాఠశాల యాజమాన్యాలు రవాణాశాఖకు హామీపత్రం సమర్పించాలి.

స్కూల్ జోన్ బోర్డులు ఏవీ

జిల్లాలో చాలా వరకు జాతీయ రహదారులతో పాటు అంతర్రాష్ట్ర రోడ్డులకు సమీపంలో ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి. ఆ ప్రాంతంలో స్కూల్ జోన్ బోర్డులు కానీ ఇతర హెచ్చరిక బోర్డులు కనిపించవు. తాజాగా స్కూల్ వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది. అటూ జడ్చర్ల వైపు నుంచి ఇటు మహబూబ్‌నగర్ నుంచి వెళ్లే వాహనాలు వేగంగా వస్తుంటాయి. ఈ క్రమంలో మయూరీ పార్క్ సమీపంలో రోడ్డుకు సమీపంలో పలు స్కూల్స్ ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు, స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయలేదు.



అవగాహన కల్పించాం..

జిల్లాలో రెండు నెలల కిందటే ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగహన కల్పించాం. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. సోమవారం జరిగిన బస్సు ప్రమాదంలో ఫిట్‌నెస్, పరిమిట్ ఉన్నాయి. ఈ బస్సు 2014 మోడల్ బస్సు 2029వరకు ఈ బస్సు తిరగడానికి అవకాశం ఉంది. యూటర్న్ చేసే క్రమంలో లారీ వేగంగా రావడం వల్ల ప్రమాదం అయినట్లు అంచనా వేస్తున్నాం.

–నరేష్, ఎంవీఐ, మహబూబ్‌నగర్